సైబర్ సెక్యూరిటీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలున్న వివిధ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, ఇన్ సైబర్ లా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా అండ్ పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, సర్టిఫికెట్ ఇన్ సైబర్ సెక్యూరిటీ, సర్టిఫికెట్ ఇన్ సైబర్ లా, కోర్సుల్లో ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 78931 41797.

9 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో శారీస్ ఆఫ్ ఇండియా పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను ఈ నెల 9 నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. నాణ్యమైన, ఎక్కడా దొరకని బెనారస్ పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత కళాకారుల కళా ఉత్పత్తులైన సిల్క్, కాటన్ వస్త్రాలతో పాటు డిజైనరీ చీరలు, ఫ్యాన్సీ వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. నాణ్యతకు మారుపేరైన సిల్క్ గ్యాలరీలోని వస్త్రాలను మహిళలు సందర్శించాలని కోరారు.

అంబర్‌పేటలో బీఆర్‌ఎస్‌దే హవా

అన్ని ప్రాంతాల్లో పట్టు నిలుపుకొన్న గులాబీ పార్టీ

- ఓటు బ్యాంకును పెంచుకోని బీజేపీ
- బీజేపీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లోనూ బీఆర్‌ఎస్ సత్తా
- వెయ్యి ఓట్ల నుంచి 24 వేల ఓట్ల మెజార్టీకి ఎదిగిన బీఆర్‌ఎస్
- గౌరవప్రదమైన ఓట్లు సాధించిన కాంగ్రెస్

అంబర్‌పేట్: అంబర్‌పేట్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. పార్టీకి క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయి నిర్మాణం లేకున్నా ఎమ్మెల్యేగా గెలిచిన కాలేరు వెంకటేష్ ఒంటి చేత్తో విజయకేతనం ఎగురవేశారు. ఎన్నికల ఫలితాల సరళిని పరిశీలిస్తే పట్టు ఉన్న బీజేపీ ప్రాంతాల్లో సహితం బీఆర్‌ఎస్ సత్తా చాటింది. నియోజకవర్గంలో ఉన్న ఐదు డివిజన్‌లలో ఒక్కో డివిజన్‌కు ఒక్కొక్క ప్రత్యేకత ఉంది. కొన్ని డివిజన్‌లలో బీజేపీ ప్రాబల్యం ఉంటే, మరికొన్ని డివిజన్‌లలో బీఆర్‌ఎస్ ప్రబల్యం ఉంది. అందుకు భిన్నంగా బీఆర్‌ఎస్ పార్టీ హవా కొనసాగింది. సాధరణంగా నల్లకుంట, బాగ్ అంబర్‌పేట డివిజన్‌లలో బీజేపీకి లీడ్ వస్తుందని భావించారు. అందుకు భిన్నంగా బీఆర్‌ఎస్‌కు లీడ్ రావడం విశేషం. అంబర్‌పేట, గోల్నాక డివిజన్‌లు బీఆర్‌ఎస్‌కు పట్టు ఉండగా అదే హవా కొనసాగింది. కాచిగూడ మాత్రం బీజేపీకి మొగ్గ ఉంటుంది అనుకుంటే అదే నిజమైంది. మిగిలిన నాలుగు డివిజన్‌లలో బీఆర్‌ఎస్‌కు ఇచ్చిన లీడ్‌ను కాచిగూడ డివిజన్లో బీజేపీకి ఇచ్చిన లీడ్ వెలవెలబోయింది. దీంతో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో విజయాన్ని నమోదు చేసుకుంది.

చీలని మైనార్టీ ఓటు బ్యాంకు..

రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీస్తుందని మైనార్టీలు ఈ దఫా కాంగ్రెస్ వైపు కొంతమేర మొగ్గు చూపుతారని అంతా భావించారు. మైనార్టీల ఓటు బ్యాంకు కాంగ్రెస్ వైపు వెళితే బీఆర్‌ఎస్‌కు నష్టం జరిగి బీజేపీ సులువుగా బయటపడుతుందని అంతా భావించారు. అందరి అంచనాలు తలకిందులయ్యేలా మైనార్టీలు బీఆర్‌ఎస్ వైపే మొగ్గు చూపారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ వారికి ఇచ్చిన హామీలను నేరవేర్చడం అందరి వాడిలా వ్యవహరించడంతో మైనార్టీలు కాంగ్రెస్ వైపు వెళ్లలేదు. దీంతో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీ నమోదు చేసుకుంది.

- బీజేపీ ఓటు బ్యాంకు పదిలంగా ఉన్నా విజయాన్ని అందించలేకపోయింది...
- అంబర్‌పేట నియోజకవర్గంలో బీజేపీ ఓటు బ్యాంకు స్థిరంగా ఉంది. గత ఎన్నికల్లో సుమారు 50 వేల ఓట్లు రాబట్టుకొని 1000 ఓట్ల తేడాతో ఓటమి పాలయింది. తాజాగా బీజేపీ అభ్యర్థికి 49 వేల ఓట్లు పడ్డాయి. అప్పటి ఓటు బ్యాంకు ఇప్పుడు కొనసాగడం, ఫలితం సహితం పునరావృతం అయింది. నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరగడం బీఆర్‌ఎస్‌కు అదే స్థాయిలో మెజార్టీ రావడం గమనార్హం. బీజేపీ గత ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొలేదన్న అంశం తేటతెల్లం అయింది.

అనూహ్యంగా కాంగ్రెస్..

గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ ఈ స్థాయి ఓట్లను రాబట్టలేదు. గతంలో డిపాజిట్ సహితం రాలేదు. ఈ ఎన్నికల్లో వూహించని విధంగా డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి అంబర్‌పేట టికెట్ దక్కించుకొని ఎన్నికల బరిలో నిలిచారు. రాగానే అతనికి పలువురు నాయకుల నుంచి అనుహ్య మద్దతు లభించింది. తక్కువ సమయంలో అయిన తనదైన శైలిలో ఎన్నికల బరిలో కొట్లాడి గౌరవప్రదమైన ఓట్లను సాధించాడు.

కాలేరుకు శుభాకాంక్షలు

అంబర్‌పేట్: ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలేరు వెంకటేష్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అన్ని వర్గాల ప్రజలు, బస్తీ సంఘులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో సోమవారం ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. శాలువలతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందించి మిఠాయిలు తినిపించారు. గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభిమానులతో కళకళలాడింది.



శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, పార్టీ నేతలు

ఓడినా ప్రజల మధ్యే ఉంటా: పూస రాజు



ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందినా వచ్చే ఐదు సంవత్సరాలు ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని బీజేపీ అభ్యర్థి పూస రాజు తెలిపారు. తనకు 35 వేల పైచిలుకు ఓట్లను వేసిన ప్రజలకు తన విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు, కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. తన ఓటమికి గల కారణాలను సమీక్షించుకొని భవిష్యత్తులో గుణపాఠంగా తీసుకొని అధిగమించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గెలుపు, ఓటములు సహజమని తనకంటే మెరుగైన ఫలితాలు సాధించిన ముఠా గోపాల్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తానని ఈ సందర్భంగా పూస రాజు స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికార ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వంతో కూడా కలిసి పని చేస్తామని, ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తామని ప్రకటించారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



కాంగ్రెస్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి అధికారం చేపట్టనున్న నేపథ్యంలో ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం అడిక్‌మెట్, రాంనగర్ చౌరస్తా తదితర ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించి సంబరాలు జరుపుకొన్నారు. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వాన్ని ఆహ్వానించారు. పార్టీ సీనియర్ నేతలు జి.ఎస్.కేశవ్, అభిషేక్‌రెడ్డి, తేజగౌడ్, వేణు, బాబుగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీల పాత్ర కీలకం



అవార్డులను అందజేస్తున్న డీఎస్ రెడ్డి

చిక్కడపల్లి: ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్స్ ఆస్తుల పరిరక్షణ, వ్యక్తులను రక్షించడంలో ప్రైవేట్ సెక్యూరిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సెంట్రల్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీస్, సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ డి.ఎస్.రెడ్డి పేర్కొన్నారు. గాంధీనగర్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ డేను సోమవారం నిర్వహించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించిన సెక్యూరిటీలకు అవార్డులతోపాటు ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్ రెడ్డి మాట్లాడుతూ... అపార్ట్‌మెంట్‌లు మొదలుకొని ఎయిర్‌పోర్ట్ వరకు ప్రైవేట్ ప్రభుత్వ సెక్టార్లలో సేవలు అందిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఒక కోటి, తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షలపై చిలుకు ప్రైవేట్ సెక్యూరిటీలు పనిచేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా 200 ప్రైవేట్ సెక్యూరిటీ కంపెనీలుగా అనేక మందికి ఉపాధి ఉద్యోగాలు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ప్రైవేట్, పబ్లిక్ సెక్టార్, ప్రజలు, సెక్యూరిటీలకు సేవలందిస్తూ అవకాశాలు కల్పిస్తున్న సెక్యూరిటీ కంపెనీలను కూడా ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైస్ చైర్మన్ ముఠా హరిగౌడ్, అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, గోపి, సురేష్, నాగరాజు, కె.రవి, జాకబ్, సీతారామయ్య, కేశవరావు పాల్గొన్నారు.

ముగిసిన శతచండీ యాగం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన శ్రీ విజయగణపతి దేవాలయంలో లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న శతరుద్రయాగ సహిత శతచండీ మహాయాగం సోమవారం ముగిసింది. వేడుకల్లో భాగంగా ఉదయం శతచండీ రుద్రహోమాలు, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం వైభవంగా జరిగాయి. అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. గత నెల 25వ తేదీన ఈ మహాయాగం ప్రారంభమైంది. భక్తుల ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలను కోరుతూ హోమాలు నిర్వహించగా భక్తులు భారీగా పాల్గొన్నారు.

దివ్యాంగ రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గాంధీ ఆస్పత్రి: వైద్యం కోసం వచ్చే దివ్యాంగ రోగుల పట్ల ప్రత్యేక జాగ్రత్త వహించి, మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని గాంధీ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ వాల్యా అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆర్థోపెడిక్ సెమినార్ హాల్లో దివ్యాంగ హక్కుల చట్టం, దివ్యాంగ రోగులకు అందించాల్సిన వైద్యసేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై పీజీ వైద్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వాల్యా మాట్లాడుతూ.. శారీరక, మానసిక వైకల్యంతో బాధపడే దివ్యాంగుల కోసం ఐక్యరాజ్య సమితి మార్గదర్శక సూత్రాల మేరకు 2016లో ప్రత్యేక చట్టం రూపొందించినట్లు తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016లో పొందుబర్చిన పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పీజీ వైద్యులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్లు సత్యనారాయణ, రవీందర్, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

ఒంటె మాంసం విక్రయించేందుకు యత్నించిన ముగ్గురి అరెస్టు



ఒంటె మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన నిందితులు

బంజారాహిల్స్: హకీంపేట కుంట సమీపంలో ఒంటె మాంసాన్ని అమ్మేందుకు ఏడు ఒంటెలను ఓ ప్రాంతంలో ఉంచగా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి ఒంటెలకు విముక్తి కలిగించారు. నిందితులను ఫిలింనగర్ పోలీసులకు అప్పగించారు. వివరాలివీ... పారామౌంట్‌కాలనీ సమీపంలో మహ్మద్ ఇస్మాయిల్(30) బెస్ట్‌బీఫ్ షాప్ నిర్వహిస్తున్నాడు. తేలికగా డబ్బు సంపాదించేందుకు ఒంటి మాంసాన్ని విక్రయించాలని తన అనుచరులు మహ్మద్ సల్మాన్, సిరాజ్‌ఖాన్‌తో పథకం వేశారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి ఒంటెలను తీసుకొచ్చి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాడులు నిర్వహించి నాలుగు ఒంటెలతో పాటు కత్తులు, తూనికల యంత్రాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అభివృద్ధే గెలిపించింది



సుందరయ్య పార్కులో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న వాకర్స్

- రెండవ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన గోపాల్‌కు ఘనంగా సన్మానం
- ముషీరాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తాను చేసిన అభివృద్ధే మళ్లీ గెలిపించేలా చేసిందని.. ప్రజలు తాను చేసిన అభివృద్ధిని గుర్తుంచుకొని భారీ మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలందరికీ ధన్యవాదాలు చెబుతున్నానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో రెండవసారి ఎమ్మెల్యేగా ముఠా గోపాల్ గెలుపొందినందుకు అభినందన సభను ఏర్పాటు చేశారు. భారీ కేక్‌ను కట్ చేయడంతో పాటు పూల దండలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అంతకు ముందు ముఠా గోపాల్ పార్కులో ఉన్న తెల్ల ఉప్పలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఠా గోపాల్ మాట్లాడుతూ... ముషీరాబాద్ నియోజకవర్గాన్ని తాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో స్టీల్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు నియోకజవర్గంలోని పార్కులన్నింటినీ ఆధునికీకరించడం జరిగిందని తెలిపారు. డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులతో పాటు విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరించామని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఎప్పటిలాగానే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో యువజన నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకటకృష్ణారావు (బబ్లూ), డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.దామోదర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.కిషన్‌రావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వి.నిరంజన్‌రెడ్డి, వి.నాగభూషణం, అంబాల నారాయణగౌడ్, మాజీ అధ్యక్షులు మురళీకృష్ణ, మనోహర్‌రెడ్డి, కళ్యాణ్‌నాయక్, శైలజమోహన్, డాక్టర్ ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి అంశ ఘంటసాల



పురస్కార గ్రహీత శ్రీనివాస్‌రావులతో మాధవ పెద్ది సురేష్, రామ సుబ్రహ్మణ్యం

చిక్కడపల్లి: ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి అంశ అని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవ పెద్ది సురేష్ అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీ త్యాగరాయ గానసభలోని ప్రధాన వేదికపై సుబ్బు మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు 101వ జయంతి సందర్భంగా 12 గంటల నిర్విరామ గానలహరిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవపెద్ది సురేష్, ప్రముఖ రంగస్థల నటుడు గాయకుడు కొమరవోలు శ్రీనివాస్‌రావుకు ఘంటసాల జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేసి మాట్లాడుతూ... సంగీత పరంగా ఘంటసాలను మించినే గాయకుడు లేరని అన్నారు. ఆయన గళం అక్కినేని నాగేశ్వరరావు నందమూరి తారక రామారావుల సినీ జీవితాల విజయానికి కారణమైందన్నారు. ఘంటసాల కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సంస్థ స్థాపకుడు శ్రీధరం రామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... ఘంటసాల ఎందరికో ఆరాధ్య దైవం అన్నారు. పురస్కారగ్రహీత శ్రీనివాసరావు ఉత్తమ గాయకుడు ఘంటసాల పాటలను దాదాపుగా అనుకరించి పాడగల వారిని వివరించారు. వేదికే పై పలువురు గాయకులను సత్కరించారు.

కేటీఆర్‌ను కలిసిన ఎంఎస్



ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జీ ఎం.ఎస్.శ్రీనివాస్‌రావు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం కలిశారు. తాను ఎన్నికల ఇన్‌చార్జీగా ఉన్న కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన లాస్య నందిత కూడా కేటీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఎంఎస్‌కు, లాస్య నందితకు శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారికి మొక్కు చెల్లించిన యూత్ కాంగ్రెస్ నేతలు



అంబర్‌పేట్: యూత్ కాంగ్రెస్ నేతలు మొక్కులు తీర్చుకొని సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సోమవారం అంబర్‌పేటకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు బాగ్ అంబర్‌పేట్‌లోని గజానంద్ గడ్డ అమ్మవారికి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అంబర్‌పేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పి.సంపత్‌యాదవ్, నాయకులు వెంకటేష్, మేఘా సాయి, రాజ్ కుమార్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ రుణం తీర్చుకున్నారు: వినోద్‌రెడ్డి



హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించి తెలంగాణ ప్రజలు సోనియా గాంధీ రుణం తీర్చుకున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.వినోద్ రెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజలకు అందిస్తామని అన్నారు.

బీఆర్‌ఎస్‌కు నర్సింగ్‌ప్రసాద్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న నర్సింగ్‌ప్రసాద్

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు పంపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పార్టీలో సీనియర్ నాయకులను పక్కనపెడుతున్నారని అందరిని ఒకేగాటిన కడుతున్నారని ఆరోపించారు. సీనియర్లు అంటే మర్యాదలేదని, పదవులకు విలువ లేదని, వయస్సుకు కూడా విలువ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ డివిజన్ అధ్యక్ష పదవీకి, బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దాంతో పాటు శాశ్వతంగా రాజకీయాల్లోంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. గత 33 సంవత్సరాలుగా ముఠా గోపాల్ అనుచరుడిగా ఉన్నానని తెలిపారు. గంగపుత్రులు గంగను దాటిస్తారు కానీ గంగలో ముంచరని అలాగే ముఠా గోపాల్‌ను గంగను దాటించిన తరువాత తనే ఆ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ముషీరాబాద్ డివిజన్‌లో ఉన్న రాజకీయాలతో తాను మనస్థాపానికి గురైనట్లు వివరించారు. తనకు డివిజన్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ముఠా గోపాల్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇక భవిష్యత్తులో పార్టీ కార్యక్రమాలలో పాల్గొనని స్పష్టం చేశారు.

ముఠా గోపాల్‌కు అభినందనల వెల్లువ

ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి రెండవ సారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ముఠా గోపాల్‌ను పలువురు కలిసి అభినందనలు తెలియజేశారు. పుష్ప గుచ్ఛాలిచ్చి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.
– ముషీరాబాద్



ఫాతిమా మసీదు పెద్దలు మహ్మద్ జహంగీర్...



ముఠా గోపాల్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కృష్ణానగర్ బస్తీ అధ్యక్షుడు శాంతి కుమార్, గోపాల్ యువసైన్యం అధ్యక్షుడు కృపి



దయానంద్‌నగర్ వాసులు...



అడిక్‌మెట్ వాసులు..

కంచుకోటలో ఎలా ఓడిపోయాం?

బీజేపీ అభ్యర్థి పూస రాజు ఓటమిపై పోస్టుమార్టం

ముషీరాబాద్: ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి నారాయణగూడ వరకు ప్రధాని నరేంద్రమోదీ ప్రచారం చేసిన, కల్పన థియేటర్ నుంచి అశోక్‌నగర్ వరకు జేపీ నడ్డా రోడ్ షో నిర్వహించిన, కేంద్ర మంత్రులు ప్రచారం చేపట్టిన, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు అన్ని తామై బీజేపీ అభ్యర్థి పూస రాజును ముందుండి నడిపించిన ముషీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి ఓటమిపై ఆ పార్టీ శ్రేణులు విస్మయానికి గురయ్యాయి. బలమైన క్యాడర్, ఐదుగురు కార్పొరేటర్లు గెలిపించుకున్న చరిత్ర ముషీరాబాద్ బీజేపీకి ఉన్నప్పటికీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎందుకు ఓడిపోయారనేదానిపై ఆ పార్టీ ఆత్మపరిశీలన చేస్తుంది. బీజేపీ అభ్యర్థి పూస రాజు బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు తెలిసినా నియోజకవర్గ ప్రజలందరికీ అంతగా పరిచయం లేకపోవడంతో పాటు అభ్యర్థి పేరును చివరి నిమిషంలో ప్రకటించడం కూడా బీజేపీ అభ్యర్థి ఓటమికి ఒక కారణంగా భావిస్తున్నారు. దీనికి తోడు నియోజకవర్గంలో బీజేపీ నాయకుల మధ్య గ్రూపు తగాదాలు ఆ పార్టీకి భారంగా మారాయి.

అలాగే కార్పొరేటర్లకు, పార్టీ నేతలకు మధ్య కూడా విభజన రేఖ స్పష్టంగా ఉంది. దీంతో ఈ గ్యాప్‌ను పూడ్చడం ఈ ఎన్నికల సమయంలో వచ్చిన పరిశీలకులకు సాధ్యం కాకుండాపోయింది. ఇక కార్పొరేటర్లు అభ్యర్థి విజయం కోసం తమ శక్తి సామర్థ్యాలను పూర్తిగా వెచ్చించినట్లు కనిపించలేదు. ఇక ముఖ్యమంత్రి బీసీ నినాదాన్ని, ఎస్సీ వర్గీకరణ నినాదాన్ని ఆయా వర్గాల్లో విస్తృతంగా తీసుకుపోకపోవడం కూడా అభ్యర్థి ఓటమికి ఒక కారణంగా భావించవచ్చు.

కాంగ్రెస్ దిగ్గజ నేతలు ప్రచారం చేసినా..

అంజన్‌కుమార్‌యాదవ్ ఓటమిపై పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ గాలి వీచి కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందింది. అందులో భాగంగానే ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ కూడా ఓటమి చెందడం సహజమే అయినా ఇక్కడ తప్పకుండా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు. అయితే ఎన్నికల ఫలితాలు చూసిన తరువాత కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయారదే స్పష్టంగా కనిపిస్తుంది. 2018 ఎన్నికల్లో అనిల్‌కుమార్‌యాదవ్ పోటీ చేసి 36,087 ఓట్లు రాగా ఈ దఫా పోటీ చేసిన అంజన్‌కుమార్‌యాదవ్‌కు 37,410 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం.

- బలమైన అభ్యర్థితో పాటు గతంలో కంటే విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, డి.కె.శివకుమార్, కన్నయ్యకుమార్, ఇమ్రాన్ హుస్సేన్‌లాంటి దిగ్గజ నేతలు ప్రచారాన్ని హోరెత్తించారు. అయినా 2018 ఎన్నికలతో పోలిస్తే కేవలం 1300 ఓట్లు మాత్రమే అధికంగా రావడం ఆ పార్టీ శ్రేణులను విస్మయానికి గురి చేసింది.
- అధికార బీఆర్‌ఎస్ పార్టీ గాలి గ్రేటర్ హైదరాబాద్‌లో బలంగా వీచడం, సంక్షేమ పథకాలు, తీసుకున్న లబ్ధిదారులు బీఆర్‌ఎస్‌కు ఓటు వేసినప్పటికి కాంగ్రెస్‌కు తక్కువ ఓట్లు రావడం పట్ల ఆ పార్టీ నాయకులు అంతర్మమానికి లోనవుతున్నారు.
- గత ఐదు సంవత్సరాలుగా కాంగ్రెస్ నాయకులు ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు పెద్దగా అందుబాటులో లేకపోవడం, చుట్టపు చూపుగా వచ్చిపోవడం ఒక కారణంగా భావిస్తుంటే ప్రత్యర్థి పార్టీలు అంజన్‌కుమార్‌యాదవ్‌ను నాన్ లోకల్‌గా ముద్ర వేయడం మరో కారణంగా కనిపిస్తుంది.
- బూత్‌స్థాయిలో మేనేజ్‌మెంట్ సరిగ్గా లేకపోవడం ఇక కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన తెలంగాణ జన సమితి, షర్మిల పార్టీ, సీపీఐ, సెటిలర్స్, పరోక్షంగా మద్దతు ఇచ్చిన తెలుగు దేశం నేతలను కలుపుకోలేదనే భావన వ్యక్తం అవుతుంది.
- ఎన్నికలకు చాలా రోజుల క్రితమే అభ్యర్థిని ప్రకటించినా కాంగ్రెస్ టికెట్ ఆశించిన నేతలను తమవైపు తిప్పుకోవడంలో, వారి బుజ్జగించడంలో అలస్యం చేశారని సంగిశెట్టి జగదీష్, నగేష్ ముదిరాజ్‌లు పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడం కూడా ఓటర్లపై ప్రభావం చూపి ఉంటుందని భావిస్తున్నారు.